క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో రెండవ విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ భైరవుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో జూలై 25వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించి వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. 27న ఐటీఐలో జరిగే ఇంటర్వ్యూకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు ఫోన్: 9533723022, 94925771731 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వీఆర్‌ఓ సేవలు అభినందనీయం


సాయిప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్

పుత్తూరు: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన తడుకు వీఆర్‌ఓ కె.సాయిప్రసాద్ అభినందనీయుడని తహసీల్దార్ కె.శ్రీనివాస గౌడ్ కొనియాడారు. సాయిప్రసాద్ ఆదివారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. డీటీ సురేష్, ఏఎస్‌ఓ మునికృష్ణయ్య, ఇన్‌చార్జ్ ఆర్‌ఐ గురుస్వామి, వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఉచిత కంటి శస్త్రచికిత్సకు 60 మంది ఎంపిక

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అరవింద్ హాస్పిటల్ వైద్యులు 149 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 60 మంది శస్త్రచికిత్సకు ఎంపికయ్యారు. వీరికి ఉచితంగా ఆపరేషన్, వసతులు కల్పించనున్నట్లు నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. ప్రేమ్‌చంద్, విశాల్, ప్రవీణ్, జ్యోతి, లలిత్ పాల్గొన్నారు.

బభ్రువాహన ఉద్యోగ విరమణ

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ బభ్రువాహన ఆదివారం పదవీ విరమణ కార్యక్రమం చిత్తూరులో నిర్వహించారు. ఆ శాఖ సీజీఎం అయూబ్‌ఖాన్, ఎస్‌ఈలు సురేంద్రనాయుడు, రమణ, పూర్వ ఎస్‌ఈ కృష్ణారెడ్డి, ఈఈ వాసురెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పలువురు అధికారులు ఆయన్ను సన్మానించారు.

చికిత్స పొందుతూ వీఆర్‌ఓ మృతి


పయణి (ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని మొగిలివెంకటగిరి గ్రామ రెవెన్యూ అధికారి పయణి ఆదివారం వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. శనివారం హైబీపీకి గురికావడంతో కుటుంబసభ్యులు వేలూరు సీఎంసీలో చేర్పించారు. హైబీపీ కారణంగా బ్రెయిన్ డెడ్ కావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పయణి మొగిలివెంకటగిరి వీఆర్‌ఓగా, తగ్గువారిపల్లె ఇన్‌చార్జి వీఆర్‌ఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీఆర్‌ఓ అకాల మరణం చెందడంపై మండల రెవెన్యూ సిబ్బంది, పలువురు వీఆర్‌ఓలు విచారం వ్యక్తం చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

భక్తులతో బోయకొండ కిటకిట

ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మా.. అమ్మ తల్లీ..బోయకొండ గంగమ్మా సుఖ శాంతులతో ఉండేలా మమ్మల్ని దీవించు తల్లీ అని మొక్కుతూ పూజలు చేశారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు, మూగజీవాల సంపద వృద్ధి చెందాలంటూ పలు గ్రామాల ప్రజలు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయంలో రద్దీ పెరగడంతో క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. తమ కోర్కెలు, మొక్కులు ఫలించిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెనలతో మేళతాళాల నడుమ అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ అధికారులు భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

సమన్వయంతో చిత్తూరు అభివృద్ధి

చిత్తూరు అర్బన్: చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు చిత్తూరు అభివృద్ధికి కృషిచేస్తామని వైస్ అధ్యక్షులు సత్య అన్నారు. నగరంలోని స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం, పార్కింగ్, రహదారులు, నీటి సరఫరా, విద్యుత్ సరఫరా సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో గోపినాయక్, మురళి, రమేష్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

సజ్జ సాగుకు సమయమిదే!



తిరుమళరాజుపురంలో సాగులో సజ్జ పంట, (ఇన్‌సెట్) ఎన్నుపోతున్న సజ్జ పంట

పాలసముద్రం: మండల వ్యాప్తంగా భూగర్భజలాల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. తీవ్ర వర్షాభావ పరిస్థితి నేపథ్యంలో చెరువుల్లో నీళ్లు లేకపోయాయి. వ్యవసాయ బోర్లలో చాలా వాటిలో అరకొర నీరు వస్తోంది. దీంతో వాటి కింద ఏ పంటలు సాగు చేయాలో దిక్కులు తోచని పరిస్థితి రైతుల్లో నెలకొంది. పెట్టుబడి పెట్టి పంట వేస్తే ఒకవేళ నీరు రాకుంటే పరిస్థితి ఏంటనే ఆందోళన కన్పిస్తోంది. ఈ పరిస్థితుల్లో సజ్జ సాగు అన్ని విధాలా అనుకూలమని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. సజ్జ సాగుకు సమయం ఇదేనని ఆయన మాటల్లో అన్నదాతలకు వివరించారు.

సజ్జ సాగు ఇలా..

భూమిని రెండు, మూడుసార్లు బాగా దుక్కి చేయాలి. ఆఖరి దుక్కిలో నాలుగు టన్నుల పశువుల ఎరువు వేయాలి. ఎకరాకు 1.6 కిలోల విత్తనం సరిపోతుంది. రెండు శాతం (20 గ్రాముల ఉప్పు లీటర్ నీటికి) ఉప్పు ద్రావణంతో విత్తనం పది నిమిషాలు ఉండాలి. దీనివల్ల ఎర్గాట్ శిలీంధ్ర అవశేషాలు పైకి తేలతాయి. వాటిని తీసివేయాలి. థైరమ్‌ను కలిపి విత్తనశుద్ధి చేయాలి. ఆ తరువాత విత్తనాన్ని సాళ్ల మధ్య 45 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 12–15 సెంటీమీటర్ల దూరం ఉండేలా గొర్రుతో విత్తాలి.

ఎరువులు ఎంత వేయాలంటే..

సజ్జ పంటకు ఎకరాకు 75 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. యూరియాను రెండు భాగాలుగా చేసుకుని విత్తే సమయంలో సగభాగం, విత్తిన 25–30 రోజులు మధ్య మిగతా సగభాగం వేయాలి.

పంటను ఎప్పుడు కోయాలంటే..

సజ్జ పంటలో ప్రధాన కాండపు కంకి మొదటికోతకు వస్తుంది. రెండు నుంచి మూడు దశల్లో కంకులను కోసుకోవాలి. కోతకు వచ్చిన సమయంలో కంకుల్లోని సజ్జగింజ కింద భాగంలో నల్లటి చుక్క కనిపిస్తుంది. మొక్క ఆకులు పసుపు రంగులోకి మారి ఎండినట్లు కనిపిస్తాయి. ఈ దశలో పంటను కోసి నూర్పిడి చేయాలి. గింజలను బాగా ఎండనిచ్చి నిల్వ చేసుకోవాలి.

పంట సస్యరక్షణ..


ఢిల్లీప్రసాద్, మండల వ్యవసాయాధికారి

ఈ సమయంలో సజ్జ పంటకు చీడపీడలు ఆశించే అవకాశం తక్కువ. ఒకవేళ తెగులు సోకినట్లు కనిపిస్తే అలాంటి మొక్కలు ఏరి వేయాలి. తెగుళ్లు ఎక్కువగా ఉన్నట్లయితే 2 గ్రాముల మెటలాక్సిల్ లీటర్ నీటికి కలిపి (ఎకరాకు 200 లీటర్ల నీటిలో 400 గ్రాముల మెటలాక్సిల్) జెడ్ లేదా గ్రాము కార్బండిజమ్‌ను లీటర్ నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. చెదలు నివారణకు ఎనిమిది కిలోల మిథైల్ పెరాథియాన్ పొడిని దుక్కిలో వేసి కలియదున్నాలి. పంట తొలిదశలో మిడతల నివారణకు 5 శాతం కార్బరిల్ పొడిని ఎకరాకు 8–10 కిలోల చొప్పున వేయాలి.

నీరు మూడు తడులిస్తే చాలు..

సజ్జ 80–90 రోజుల పంట. మూడు తడులు ఇస్తే చాలు మంచి దిగుబడి నిస్తాయి. 42 డిగ్రీల అధిక వేడిని సైతం తట్టుకుని పంట చేతికొస్తుంది. ఈ సమయంలో పంటలు సాగు చేస్తే తెగుళ్లు సోకే అవకాశం తక్కువ. పైగా పంట నాణ్యతగానూ ఉంటుంది. అన్నిరకాల సజ్జ విత్తనాలు కంకి తెగుళ్లను తట్టుకుంటాయి. బెట్ట పరిస్థితులను సైతం అధిగమించి మంచి దిగుబడులు, నాణ్యమైన మేతను ఇస్తాయి. సజ్జ సాగుకు తేలికపాటి, మధ్యరకం నేలలు, ఎర్ర నేలలు, నీరు ఇంకే, నల్ల రేగడి నేలలు అనుకూలంగా వుంటాయి.

పంటలో కలుపు నివారణ..

పంట విత్తిన 24 నుంచి 48 గంటల్లో అట్రాజిన్ 50 శాతం కలుపుమందును ఎకరాకు 600 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి తేమ ఉన్న సమయంలో పిచికారీ చేయాలి. దీనివల్ల 25 నుంచి 30 రోజుల వరకు ఎలాంటి కలుపు మొక్కలూ పెరగవు. విత్తిన రెండు వారాల్లోగా ఒత్తుగా ఉన్న మొక్కలను తీసివేయాలి. విత్తిన మూడు వారాలకు దంతులతో ఎడసేద్యం చేయడం వల్ల కలుపు మొక్కలను సమర్థవంతంగా నివారించవచ్చు. పైగా సాళ్లలో ఉన్న తేమ మొక్కలకు అందుతుంది. దీంతో సజ్జ దిగుబడి ఎక్కువగా ఉంటుంది.

అలరించిన దుర్యోధన వధ



గంగమడుగులోంచి దుర్యోధనుడిని లాక్కొస్తున్న భీముడు, పట్టాభిషేకం అనంతరం ధర్మరాజులు

● ముగిసిన మహాభారత ఉత్సవాలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట గ్రామంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గత పది రోజులుగా జరుగుతున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. తర్వాత భాగవతారిణి స్వర్ణలతచే హరికథా కాలక్షేపం జరిగింది. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కొని ఉన్న దుర్యోధనుడిని భీమసేనుడు లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం ఆహూతులను అలరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారుల భీకరపోరు భక్తులను కట్టిపడేసింది. ఇద్దరి మధ్య వీరోచితంగా సాగిన పోరులో దుర్యోధనుడు తనువు చాలిస్తాడు. కళాకారులు చేసిన నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. తర్వాత ధర్మరాజుల పట్టాభిషేకం జరిగింది. సాయంత్రం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు కంకణదారులై ఉపవాసాలతో అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి రూ.22 వేల విలువచేసే హార్మోనియం డోలక్‌లను తంగేళిమిట్ట గ్రామానికి చెందిన కీశే దామోదరంశెట్టి సతీమణి సులోచనమ్మ, కుమారులు రమేష్, రవి ఈసందర్భంగా విరాళంగా ఇచ్చారు. అమ్మవారి ఆలయంలో పది రోజులుగా సాగిన మహాభారత ఉత్సవాలు ప్రతిరోజూ పండుగ వాతావరణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.


వితరణ చేస్తున్న దాతలు

గ్రావెల్ తరలిస్తే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం: మండలంలో ఏ పార్టీ వారైనా గ్రావెల్ తరలిస్తే చర్యలు తీసుకోవాలని, కేసు నమోదు చేయించాలని ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. ఆదివారం మండల కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మొదటిసారిగా పాల్గొన్నారు. మండలంలో ఆయా శాఖ అధికారులు గత ప్రభుత్వంలో చేపట్టిన పనులపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్రమ క్వారీ, ఇసుకపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, తహసీల్దార్ మల్లికార్జునరావు, డీఎస్పీ నరసింహమూర్తి, ఎంపీడీఓ బ్రహ్మయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపోలేరమ్మకు పొంగళ్లు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు గ్రామంలోని పోలేరమ్మ దేవాలయంలో గ్రామదేవత శ్రీపోలేరమ్మ దేవతకు ఆదివారం గ్రామస్తులు పొంగళ్లు సమర్పించారు. శ్రీ పోలేరమ్మ దేవతకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి, హోమాలు చేశారు. భక్తిశ్రద్ధలతో గ్రామస్తులంతా ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు పెట్టారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సేంద్రియం.. లాభాలు అధికం!

- రసాయనిక ఎరువుల వినియోగంతో రైతులకు నష్టాలు
- క్రమంగా పెరుగుతున్న సేంద్రియ ఎరువుల వాడకం
- భూసారం పెరగడంతో పాటు పెట్టుబడులు తగ్గుతుండడంతో మొగ్గు


సేంద్రియసాగు

కాణిపాకం: విచ్చలవిడిగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమి తన సహజ లక్షణాన్ని కోల్పోయి చౌడు భూములుగా మారిపోయే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అంతేకాక పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గిపోతాయని హెచ్చరిస్తున్నారు. రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచిస్తున్నారు. మరోవైపు తెగుళ్లు ఎక్కువై ఏటా నష్టాలను చవి చూస్తుండడంతో రైతుల ఆలోచనల్లో కూడా మార్పు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో వారు పశువుల వ్యర్థాలను పంట పొలాల్లో కలపడం ద్వారా భూ సారాన్ని పెంచుకునేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకల విసర్జితాలను కొనుగోలు చేసి పంట పొలాలకు తోలుతున్నారు. వేరే ప్రాంతాల నుంచి మేత కోసం వచ్చే గొర్రెలు, మేకల కాపరులకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది.

ఎరువుల లభ్యత ఇలా...

- పశువుల వ్యర్థాలను పొలాలకు తోలుకోవడంతో పాటు గొర్రెల, మేకలను పొలంలో మంద కట్టించడం కోళ్ల వ్యర్థాలు వంటి వాటిలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి.
- పశువుల పేడను కంపోస్టు విధానం ద్వారా నిల్వ చేసుకున్న తర్వాత పంట పొలాలకు వాటిని తరలించుకోవాలి.
- వేప పిండి, పొగాకు పిట్టు వంటివి కొనుగోలు చేసుకోవచ్చు. అంతేకాకుండా రైతులు సొంతంగా వర్మీ కంపోస్టు ఏర్పాటు చేసుకుని సేంద్రియ ఎరువును తయారుచేసుకోవచ్చు.

పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలి

పశువుల వ్యర్థాలు, వర్మీకంపోస్టు లభ్యం కాని రైతులు పచ్చిరొట్ట పైర్లను కూడా సాగు చేసుకోవచ్చు. పంటలు వేసేందుకు కనీసం నెల రోజుల ముందుగా పిల్లిపెసర, జీలుగ, జనుము వంటి విత్తనాలను చల్లుకోవాలి. అవి బాగా ఏపుగా పెరిగిన తర్వాత ట్రాక్టర్‌తో భూమి లోపల వరకు కలియదున్నాలి. అవి కావలసిన సారాన్ని భూమికి అందిస్తాయి.

సేంద్రియ ఎరువుల వల్ల ఉపయోగాలు

- భూమిలో తేమ శాతం పెరగడంతో పాటు మొక్కలకు సరిపడా తేమను అందించేందుకు ఉపయోగపడుతుంది.
- పంటకు కావలసిన ముఖ్య పోషకాలు సేంద్రియ ఎరువుల వల్ల అందుతాయి.
- సేంద్రియ ఎరువును భూమిలో కలపడం ద్వారా మొక్క త్వరగా భూమిలోకి చొచ్చుకుపోయి ఏపుగా పెరుగుతుంది.
- సేంద్రియ ఎరువును ఎండాకాలంలో ట్రాక్టర్‌తో దుక్కిదున్నే ముందు భూమిలో చల్లి కలియదున్నితే వర్షాలకు ఎరువు కొట్టుకుపోకుండా ఉంటుంది.

పెట్టుబడులు తగ్గుతాయి



సేంద్రియ ఎరువులు వాడడం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయి. పశువుల వ్యర్థాలు, పచ్చిరొట్ట పైర్లను సాగుచేయడం వల్ల భూమి సారవంతమవుతుంది. దీంతో పంట ఏపుగా పెరగడంతో పాటు పెట్టుబడులు కూడా తగ్గుతాయి. విచ్చలవిడిగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల చౌడు భూములుగా మారే ప్రమాదం ఉంది.

– ఉమ, ఏడీ, వ్యవసాయశాఖ, చిత్తూరు

ఉచిత వైద్యశిబిరానికి స్పందన


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటరమణ

పెనుమూరు (కార్వేటినగరం): తిరుపతి వెంకటరమణ గుండె, మెటర్నిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని హాస్పిటల్ చైర్మన్, గుండె వైద్యనిపుణులు డాక్టర్ సి.వెంకటరమణ, స్త్రీల నిపుణులు డాక్టర్ ఆర్.నిరుపమ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ నేడు ఉన్న జీవన ప్రయాణంలో ఒత్తిడి, ఆహారపు అలవాట్ల వల్ల గుండె సంబంధిత సమస్యలు వస్తున్నాయని తెలిపారు. శిబిరంలో 260 మందికి పరీక్షలు చేశామని, అవసరమైన వారికి ఉచితంగా ఈసీజీ, ఎకో, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆయన సేవలు ఆదర్శం


హేమారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కార్వేటినగరం: హేమారెడ్డి సేవలు ఉపాధ్యాయులకు ఆదర్శమని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్ అన్నారు. కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తూ ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ హేమారెడ్డి గతంలో కూడా కత్తెరపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎంగా, ఎంఈఓగా విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. సత్యవేడు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రాజేష్ మాట్లాడుతూ హేమారెడ్డి విధి నిర్వహణలో ఉపాధ్యాయులకు ఆదర్శమని కొనియాడారు. విద్యాభివృద్ధికి నితరంతం కృషి చేసిన వ్యక్తి ఆయన అని తెలిపారు. అలాగే పలు మండలాల నుంచి కార్యక్రమానికి విచ్చేసిన పలువురు ఎంఈఓలు మాట్లాడుతూ హేమారెడ్డి క్రమశిక్షణకు మారుపేరని, విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన వ్యక్తి అని తెలిపారు. హేమారెడ్డి, సుజల దంపతులను ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రాజు, రిటైర్డ్ తుడా ప్లానింగ్ అధికారి కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ వైస్ ఎంపీపీ కార్తీక్, ఎంఈఓలు విజయకుమార్, బాబయ్య, రవి, ఓం నమశ్శివాయ, రిటైర్డ్ ఎంఈఓ రవిశంకర్, ఎస్టీయూ రాష్ట్ర నేత గాజుల నాగేశ్వర్‌రావు, కత్తెరపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయానికి టికెట్ కౌంటర్ వితరణ



ఈఓకు ఎక్విప్‌మెంట్స్ అందజేస్తున్న దాతలు, టికెట్ కౌంటర్

నగరి: దేశమ్మ దేవస్థానానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం దాతలు ఆన్‌లైన్ టికెట్ కౌంటర్‌ను విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన బి.వీరవెంకట త్రినాథ్ కేశవ, ధనలక్ష్మి దంపతులు వారి కుమార్తె చిత్రశ్రీ, కుమారుడు యువనేష్ కృష్ణ ఆదివారం ఈఓ కె.రామచంద్రారెడ్డికి అందజేశారు. అలాగే చెన్నైకి చెందిన రమేష్ అభిరామి ఇంజినీరింగ్ వర్క్స్ ఆన్‌లైన్ కౌంటర్ కోసం కంప్యూటర్, ప్రింటర్‌తో పాటు గర్భాలయంలో వినియోగించుకోవడానికి ఏసీని వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ హెల్త్ విభాగం కార్మికుల ధర్నా


ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

తిరుపతి సిటీ: టీటీడీ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులను యథావిధిగా కొనసాగించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో టీటీడీ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా టీటీడీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.సుబ్రమణ్యం, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడారు. టీటీడీ హెల్త్ విభాగం ద్వారా విద్యాసంస్థలలో, తిరుచానూరు, గోవిందరాజస్వామి టెంపుల్, ఏడీ బిల్డింగ్ ప్రాంతాల్లో 20 ఏళ్ల నుంచి 570మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరిలో 250మంది కార్మికులను తొలగించాలని టీటీడీ హెల్త్ టెండర్‌లో నిబంధనలు పెట్టడం దారుణమన్నారు. టీటీడీలో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికుల కడుపుకొట్టే ప్రయత్నం చేస్తే సహించేది లేదని, ఏ ఒక్క కార్మికుడినైనా విధుల నుంచి తొలగిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి వర్గసభ్యురాలు పి.బుజ్జి, కార్మికులు పాల్గొన్నారు.

సూపర్ బజార్‌పై టీడీపీ రాజకీయ కక్ష

- నిర్వీర్యం చేయాలని కుట్రలు, కుతంత్రాలు
- సూపర్ బజార్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్

పలమనేరు: రాష్ట్రంలోనే లాభాల్లో ఉన్న పలమనేరు సహకార బాలాజీ సూపర్‌బజార్‌ను ఎలాగైనా నాశనం చేయాలనే కుట్రతో ఇప్పుడు అధికారంలోకి వచ్చిన టీడీపీ ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఫిర్యాదులు చేస్తోందని పలమనేరు సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్వీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. స్థానిక సూపర్‌బజార్‌లో ఆదివారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీడీపీ తప్పుడు ఫిర్యాదుతో మూడ్రోజుల క్రితం జిల్లా సహాయ సహకార సంఘ అధికారి, స్థానిక ఆర్డీఓ ఇక్కడ విచారణ చేసి ఎలాంటి అక్రమాలు జరగలేదని తేల్చిన విషయాన్ని జనం గుర్తుంచుకోవాలన్నారు. తాను 1986 నుంచి సూపర్‌బజార్ అధ్యక్షుడిగా ఎన్నికవుతూనే ఉన్నా, నాడు ఏడు వేలు ఓటర్లుండగా ఇప్పుడు 14వేల ఓటర్లున్నారని తెలిపారు. ఏటా సూపర్‌బజార్‌కు సంబంధించిన లెక్కలను ఆడిటర్ ద్వారా అన్ని సక్రమంగానే నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది సైతం రూ.29.50 లక్షల ఆదాయం సూపర్‌బజార్‌కు వచ్చిందన్నారు. ఇక్కడ ఎందుకు లాభాలు తక్కువగా ఉంటాయంటే ఇది ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన సొసైటీ కాబట్టి ఇన్నేళ్లుగా తక్కువ ధరలకే వస్తువులను విక్రయిస్తున్నామన్నారు. పట్టణంలో ఎన్నో కార్పొరేట్ సంస్థలున్నా సూపర్‌బజార్ రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉందంటే దానికి తమ పటిష్టమైన పాలనే కారణమన్నారు. ఇలాంటి సహకార సంఘానికి ఎన్నికలు జరగకపోవడం కాస్త ఇబ్బందే అయినా ఇప్పటికీ లాభాల్లో నడుస్తున్నందున దీనిపై ఏ రాజకీయ పార్టీగానీ తమను ఇబ్బంది పెట్టింది లేదన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా వ్యాపారం బాగున్నందున పాత కమిటీనే వారు కొనసాగించారనేది గుర్తుంచుకోవాలన్నారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన టీడీపీ ఈ సూపర్ బజార్‌పై కక్షగట్టి లేనిపోని ఆరోపణలు చేయడం ఇది రాజకీయకక్షేనని మండిపడ్డారు. టీడీపీ నాయకుడు ఇక్కడ అవినీతి జరుగుతోందని సూపర్‌బజార్‌పై బురద చల్లేందుకు ఫిర్యాదులు చేసినా ఇక్కడ విచారణ చేసిన అధికారులు ఎలాంటి అక్రమాలు లేవని తేటతెల్లం చేయడం ప్రజలకు అర్థమై ఉంటుందన్నారు. సూపర్‌బజార్‌లో ఎక్కడైనా తప్పులు జరిగి ఉంటే ఎవరైనా సరే విచారణ చేసుకోవచ్చునని, తనపై టీడీపీ నేతలు లాభాల బాటలో ఉన్న సూపర్‌బజార్‌పై కుట్రలు కుతంత్రాలకు పాల్పడరాదని హితవు పలికారు. ఏదేమైనా సూపర్ బజార్ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈ ప్రభుత్వం కక్ష సాధింపులకు పూనుకోకుండా అవసరమైతే ఎన్నికలు నిర్వహించుకోవచ్చన్నారు.